నిధులు వెనక్కి.. రోడ్డు పాతాళానికి

- మురిగిపోయిన రూ.25 కోట్ల నిధులు
- విస్తరణ, అభివృద్ధి ఆగిన సిద్ధాపురం రోడ్డు


కుంగిపోతున్న ఆకివీడు-సిద్ధాపురం రహదారి

ఆకివీడు: రూ. 25 కోట్లతో అభివృద్ధి చెందల్సిన రహదారి కుంగిపోతుంది. పలు చోట్ల రోడ్డు దిగబడి పోతూ వాహన చోదకులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. నిధుల లేమితో కొన్ని చోట్ల రోడ్డు పనులు ఆగిపోతే, మంజూరైన నిధులతో పనులు ప్రారంభించకపోవడంతో వెనుదిరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను నిలుపుదల చేసింది. ఆ తరహాలో మండలంలోని కొల్లేరు తీరంలో సిద్ధాపురం రహదారి ఉంది. రహదారి అభివృద్ధి, విస్తరణకు రూ.25 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించే తరుణంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో నిధులను వెనక్కి మళ్లించేందుకు ప్రత్యేక జీవోను విడుదల చేశారు. దీంతో సిద్ధాపురం రహదారి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది.

వందలాది వాహనాల రాకపోకలు

ఆకివీడు-సిద్ధాపురం రహదారి వెంబడి సుమారు 8 గ్రామాల ప్రజలు రాకపోకలు నిర్వహిస్తుంటారు. నిత్యం వందలాది వాహనాలు, లారీలు, టిప్పర్లు, ఇతర భారీ వాహనాల రాకపోకలు చేస్తున్నారు. కొల్లేరు తీరంలోని చేపలు, రొయ్యల సాగు, వ్యవసాయం సాగుతో పాటు ఆ ప్రాంతంలోని నందమిల్లిపాడు గ్రామంలో భారత ఆహార సంస్థ ప్రైవేట్ గోడౌన్ ఉంది. రైస్‌మిల్లులు, ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నా యి. చేపల మేత, రొయ్యల మేత, ధాన్యం, గడ్డి, బియ్యం ఎగుమతులు, దిగుమతులు చేస్తుంటారు. సింగిల్ రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని గత ప్రభుత్వంలో రూ.25 కోట్ల నిధులు మంజూరు చేశారు. రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు కేటాయించారు. సకాలంలో పనులు మొదలు పెట్టకపోవడంతో నిధులు వెనక్కి మళ్లడంతో కొల్లేరు తీర ప్రాంత ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్టైంది.

నిధులు విడుదల చేయాలని వినతి



పనులు చేపట్టకపోవడంతో ప్రభుత్వం వెనక్కి తీసుకున్న నిధులను తిరిగి మంజూరు చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా నిధులను విడుదల చేయలేదు. ఈ వేసవిలోనైనా నిధులు విడుదల చేసి, రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడతారో లేదోనన్న సందేహంలో ప్రజలు ఉన్నారు.

– పూసపాటి యువ రామకృష్ణంరాజు, గ్రామస్తుడు

రాష్ట్ర వ్యాప్తంగా వెనక్కి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి నిధులు మంజూరై పనులు మొదలు పెట్టని పనులన్నింటినీ ప్రభుత్వం కొత్త జీఓ జారీ చేసి నిలుపుదల చేసింది. దీంతో సిద్ధాపురం రహదారికి రూ.25 కోట్ల నిధులు కూడా ఉన్నాయి. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు నిధులు తిరిగి కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు.

– శ్రీహరి, ఆర్అండ్‌బీ ఏఈ, ఆకివీడు

క్లుప్తంగా

బాధ్యతాయుతంగా పని చేస్తేనే సంతృప్తి


అనంతలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న గీతాబాయి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ ఉద్యోగంలో బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే సంతృప్తి కలుగుతుందని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా ఉప విస్తరణ, మీడియా అధికారిణిగా 38 ఏళ్ల పాటు సుదీర్ఘ సర్వీసును పూర్తి చేసుకుని పదవీ విరమణ చేసిన పెనుమర్తి అనంతలక్ష్మిని మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ వీడ్కోలు సభలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతా బాయి మాట్లాడుతూ సహ ఉద్యోగులు అనంతలక్ష్మిని విధి నిర్వహణలో ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్, డీఎస్ఎంఓ క్రాంతి, మెడికల్ ఆఫీసర్లు, పలు హోదాలల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

కాళ్ల: వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ మండల కార్యదర్శి టి.విద్యాసాగర్ కోరారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మంగళవారం కాళ్ల తహసీల్దార్ జి.సుందరసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. గత 8 ఏళ్లుగా వేతనాలు పెరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తెలంగాణలో మాదిరిగా నామినీలతో సహా వీఆర్ఏలకు పేస్కేల్ జీతాలు చెల్లించాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి జి.రామకృష్ణ, బి.డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలో తోపులాట


నగర పంచాయతీ వద్ద పడిగాపులు కాస్తున్న దరఖాస్తుదారులు

ఆకివీడు: కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తులు ఇంటర్వ్యూల కోసం స్థానిక నగర పంచాయతీ వద్ద పడిగాపులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఇంటర్వ్యూలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు అధిక సంఖ్యలో హాజరవగా సరైన సదుపాయాలు లేక తోపులాట జరిగింది. నగర పంచాయతీ పరిధిలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం 804 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు 720 మంది హాజరయ్యారు. నగర పంచాయతీ పరిధిలో సుమారు 41 యూనిట్లకు మాత్రమే ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. దీంతో భారీగా దరఖాస్తులు రావడంతో ఇంటర్వ్యూలు గంటల తరబడి నిర్వహించారు. కమిషనర్ కృష్ణమోహన్ ఇంటర్వ్యూలను నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కృష్ణారావు

భీమవరం: పట్టణ పరిధిలోని దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని మంగళవారం మధ్యాహ్న భోజన, పాఠశాల పారిశుద్ధ్య సమన్వయ కర్త కె.కృష్ణారావు ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నూతన మెనూ నిర్వహణ, భోజనం తయారీకి వినియోగించే పదార్థాలు పరిశీలించారు. అలాగే పాఠశాలలోని తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, గుడ్లు, బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకునే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం కృష్ణారావు విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తణుకు అర్బన్: తణుకు మండలం వేల్పూరు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ తాడేపల్లిగూడెం డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలిపారు.

ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కాళ్ల: గ్రామంలోని జగనన్న కాలనీని ఆనుకుని అక్రమంగా తవ్వుతున్న ఆక్వా చెరువులను నిలుపుదల చేయాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, కాలనీ వాసులు మంగళవారం కాళ్ల తహసీల్దార్ సుందర్ సింగ్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కాళ్ల గ్రామంలోని జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకోవడానికి స్థలాలు ఇచారు. దీంతో ఇల్లు నిర్మించుకున్న పేదలకు కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు. కాలనీని ఆనుకుని పడమర దిక్కులో ఉన్న భూములను ఆక్వా చెరువులుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారని, దీని వలన తమ కాలనీవాసులకు ఇబ్బందని వాటికి అనుమతులు మంజూరు చేయొద్దని పీజీఆర్ఎస్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినా మత్స్యశాఖ అధికారులు కనీసం పరిగణనలోకి తీసుకోకుండా అనుమతులు మంజూరు చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో సుమారు 27 ఎకరాలు తవ్వడానికి రైతు సిద్ధపడుతున్నారని, అక్కడ ప్రభుత్వ భూమి, దేవస్థానం భూమి, అసైన్డ్ భూమి కూడా ఉన్నాయని మత్స్య శాఖ, రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి కాలనీని ఆనుకుని చెరువులు తవ్వకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి


ఉపాధి హామీ కూలీలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జక్కంశెట్టి సత్యనారాయణ, ఇంజేటి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు రెండు నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా క్యాదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ భీమవరం మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తుందుర్రు గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీ పనులు చేస్తున్న వారిని వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ సంఘాల సభ్యులు కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోజు వారి కూలీ రూ.600, ఏడాదికి 200 పని దినాలు పెంచాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి సత్యనారాయణ, ఇంజేటి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీ పనులు చేసిన 15 రోజుల్లోనే వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నా రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

రామాలయాల్లో అన్నసమారాధన


కాళ్లలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు


భీమవరంలో అన్నసమారాధన చేస్తున్న నిర్వాహకులు

కాళ్ల: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని స్థానికంగా ఉన్న సుమారు 120 ఏళ్ల చరిత్ర గల పురాతన రామాలయ ప్రాంగణంలో మంగళవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత పలు రకాల పిండి వంటలతో స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

మెంటేవారి తోటలో..

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలో ముగిసిన శ్రీరామనవమి మహోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రంధి రవితేజ అన్న సమారాధనను ప్రారంభించారు. గ్రంధి చిన్న తాతారావు, ముత్యాల రామారావు, కొనతం సత్యనారాయణ, తాళ్ల భట్టు గోపాల రాజు, ఉగ్గిరాల సత్యనారాయణ, చిలకా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక


నూతనంగా ఎన్నికైన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిని అభినందిస్తున్న కార్యవర్గ సభ్యులు


నూతనంగా ఎన్నికైన ఎస్సీల అభివృద్ధి కార్యవర్గ సభ్యులు

భీమవరం: చాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బొండాడ రామ్మోహనరావు తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరించారు. చాంబర్ అధ్యక్షుడిగా పులఖండం కోటేశ్వరరావు, కార్యదర్శులుగా కాగిత వెంకట రమణారావు, సంగడి వీర వెంకట శివ సత్యనారాయణ (బుజ్జి), ఆర్‌వీ ప్రసాద్ రావు, సుంకర సాయి వెంకట నాగ కేశవరావు (చినబాబు), కోశాధికారిగా కురిశేటి వెంకట సాయిరాం కుమార్‌బాబు, ఉపాధ్యక్షులుగా తుమ్మలపల్లి నాగ శివ వెంకటకృష్ణమూర్తి, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, నార్కెడమిల్లి గురుప్రసాద్, 18 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఎస్సీల అభివృద్ధి సంఘం కార్యవర్గం ఎన్నిక

షెడ్యూల్ కులాల అభివృద్ధి సంఘం నూతన కార్యవర్గం మంగళవారం భీమవరం అంబేడ్కర్ భవనంలో కగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా కాటం స్టాన్లీ రాజు, ఎస్.విజయ్‌కుమార్, కోశాధికారిగా ఎంఎస్‌వీ ప్రసాద్, భవన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఆడమిల్లి వీరయ్య, గౌరవాధ్యక్షుడిగా యేలేటి న్యూటన్, గంటా సుందర్ కుమార్, ఉపాధ్యక్షుడిగా దుండి అశోక్‌బాబు ఎన్నికయ్యారు. అలాగే మహిళా ప్రతినిధులుగా లక్కాబత్తిన జ్యోతిర్మయి, సత్యాల శాంతకుమారి, గరికిముక్కు మేరిఆలీషా, పాలవెల్లి మంగ, బందెల ప్రమీలా, చిగురుపాటి రాహేలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నీలం అశోక్‌కుమార్, బిరుదుగడ్డ రమేష్‌బాబు, గమిడి నెల్సన్, మీసాల జయరాజు, గుల్లంకి రాజు, కొండేటి సుధాకర్, సోడదాసి గంగయ్య, బందెల జార్జిరాజు, పోతుల శ్వేత, పిల్లి అమూల్యారావు తదితరులు పాల్గొన్నారు.

● ఆహ్లాదం.. మేఘావృత ఆకాశం


మేఘావృతమైన ఆకాశం

మండుటెండలతో అల్లాడుతున్న ప్రజలకు మంగళవారం సాయంత్రం సేద తీరినట్టైంది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృత్తమైంది. దీంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. కొద్ది సేపటికే ఈదురు గాలులు వీయడంతో కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. గాలులకు చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. వర్షం పడుతుందని రైతులు ఆందోళన చెందారు. - ఆకివీడు

సారా నిందితుల బైండోవర్


నిందితులను తహసీల్దార్ ఎదుట హాజరుపరిచిన ఎక్సైజ్ పోలీసులు

పాలకోడేరు: సారా కేసులో ఆరుగురిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచారు. మండలంలో పలు గ్రామాలకు చెందిన ఆరుగురు పుప్పాల రామకృష్ణ (కుముదవల్లి), చేబ్రోలు శ్రీనివాసరావు (పెన్నాడపాలెం), చెల్లంకి రామాంజనేయులు (పాలకోడేరు), ఇరగవరపు శ్రీనివాసరావు (మోగల్లు), తాళం రామకృష్ణ (కుముదవల్లి), ఘంటసాల లీలావతి (మైప)లను మంగళవారం అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మి ఎదుట హాజరు పరిచారు. ఏడాది కాల పరిమితిలో మరలా నేరం చేస్తే లక్ష రూపాయలు చెల్లించాలని తహసీల్దార్ వారిని హెచ్చరించినట్లు ఎక్సైజ్ సీఐ బలరామరాజు తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి


భీమవరం: ధర్నా నిర్వహిస్తున్న నాయకులు


భీమవరం అర్బన్: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భీమవరం: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాలని భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో మంగళవారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరి బిక్కిరైన సామాన్య, మధ్య తరగతి ప్రజలపై గృహ అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్లు, ఉజ్వల పథక లబ్ధిదారులపై సిలిండర్‌కు రూ.50 పెంచడం దారుణమన్నారు. ఉపాధి లేక ఉపాధి పథకం బిల్లులు నెలలు తరబడి చేతికి అందక ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాలో ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరావు, డి.త్రిమూర్తులు, కె.కృష్ణ, బి.వరలక్ష్మి, కలిశెట్టి వెంకట్రావు, యు.హేమశంకర్, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, ఛాన్ బాషా, నాగిడి శాంతమూర్తి, కె.మల్లేశ్వరరావు, మల్లుల శ్రీనివాస్, వీరవల్లి బాబ్జీ, నీలాపు శ్రీను, రెల్లా రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపొద్దు

భీమవరం అర్బన్: గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపొద్దని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో పెదపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ఆదాయాలు లేక కొనుగోలు శక్తి తగ్గిపోతుంటే వారిపై గ్యాస్ బండపై రూ.50, పెట్రోలు, డీజిల్‌పై రూ. 2 పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో మంద చిరోమణి, చిలకపాటి శకుంతల, కొండేటి కుమారి, వర్ధనపు పెద్దిరాజు, చిలకపాటి రాజు, ఇంజేటి రమేష్, శాంతికుమారి, మందా కుటుంబరావు, కొండేటి పున్నమ్మ, భూషణం పాల్గొన్నారు.

మే 1న భగవద్గీత పోటీలు

భీమవరం: పట్టణంలోని ఉమా సోమేశ్వర భగవద్గీతా సమాజం ఆధ్వర్యంలో మే 1వ తేదిన భగవద్గీతలోని 11వ అధ్యాయం-విశ్వరూప సందర్శన యోగంపై భగవద్గీత పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం వెల్లడిస్తూ ఉమాసోమేశ్వర భగవద్గీతా సమాజం 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామన్నారు. మొదటి విభాగంలో 8 ఏళ్ల నుంచి 15 ఏళ్ల వయస్సు వారికి 11వ అధ్యాయంలో 1 నుంచి 41వ శ్లోకం వరకు, రెండో విభాగంలో 16 ఏళ్ల వయస్సు పైబడిన వారు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వీరికి 11వ అధ్యాయంలోని 55 శ్లోకం పూర్తిగా చెప్పాలన్నారు. ఈ పోటీలు పట్టణంలోని శ్రీఉమాసోమేశ్వర, జనార్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామని ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పేరును ఈ నెల 29వ తేదీ లోగా సెల్ 94908 33009, 99851 22669 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

నూతన ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): అమలాపురం రూట్‌లో నూతన ఎక్స్‌ప్రెస్ బస్‌ను మంగళవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. డిపో మేనేజర్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ భీమవరం నుంచి పాలకొల్లు, రాజోలు, జగ్గన్నపేట, మామిడికుదురు మీదుగా అమలాపురం వెళ్లే ఈ సర్వీసును ప్రయాణికులు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రయాణికులు త్వరితగతిన వెళ్లేందుకు భీమవరం బస్టాండ్ నుంచి ప్రతి 25 నిముషాలకు ఒక ఎక్స్‌ప్రెస్ బస్ నడుపుతున్నామని డిపో మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీకాంతం

భీమవరం అర్బన్: గర్భిణులు విధిగా పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. మండలంలోని జొన్నలగరువులో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీకాంతం మాట్లాడుతూ గర్భిణులు 9 నెలలు పూర్తయ్యే సరికి 10 నుంచి 12 కేజీల బరువు పెరగాలన్నారు. అంతే కాకుండా ఇంటి పనులు చేసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రిపాలు పట్టించాలన్నారు. ఈ ముర్రిపాలు పసికూనకు వ్యాధి నిరోధక వ్యాక్సిన్‌గా పని చేస్తుందన్నారు. 6 నెలలు వరకు తల్లి పాలు పట్టి తరువాత ఆ పాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలన్నారు. 2 సంవత్సరాలు వరకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోడదాసి లలిత కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. కనకమహాలక్ష్మి, సిబ్బంది ఎమ్ బేబి, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు


కుక్కల కేంద్రాన్ని పరిశీలిస్తున్న నర్సింహారావు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ పరిధిలో గల వీధి కుక్కల కేంద్రాన్ని రాజమహేంద్రవరం ఆర్‌డీఎంఏ సీహెచ్ నాగ నరసింహారావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, కుక్కల కోసం ఏర్పాటు చేసిన అదనపు బోనులను, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తక్షణమే తగు ప్రణాళికను సిద్ధం చేసి దాని ప్రకారం ఈ నెల 11వ తేదీ నుంచి వార్డులో కుక్కలను పట్టి వాటికి నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించాలని ఒప్పంద ఏజెన్సీకి తెలిపారు. ఆయనతో పాటుగా భీమవరం పురపాలక సంఘ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, డిప్యూటీ ఇంజనీర్ రహీం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి ఆర్.సోమశేఖర్, సంబంధిత వార్డు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు సేల్స్‌మేన్‌పై ఫిర్యాదు

భీమవరం: రెండో పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో పని చేస్తున్న సేల్స్‌మేన్‌పై రూ.3.75 లక్షలు వాడుకున్నట్లు ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. ఈ నెల 2 నుంచి 6 వరకు లెక్కలు చూపలేదని, రూ.3.75 లక్షలు వాడుకున్నట్లు తెలుస్తుందని కె.శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై ఇజ్రాయేల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

భీమవరం: రెండో పట్టణం నుంచి గొల్లలకోడేరు ద్విచక్ర వాహనంపై వెళుతున్న డి.నాగశ్రీ అచ్యుత రామశర్మ డాక్టర్ బీవీ రాజు మార్గ్ వద్ద కారు డోరు తగిలి కింద పడిపోయాడు. దీంతో అతడి కాలికి గాయమైనట్లు పోలీసులు తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రహదారి పక్కన నిలిపిన కారు డోరు తీయగా రామశర్మకు తగిలి కింద పడిపోయాడని తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఇజ్రాయేలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భీమవరం రెండో పట్టణం బలుసుమూడికి చెందిన కె.సుధారాణికి నాగరాజుతో 5 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అయితే ఇటీవల అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని, దీనిపై ప్రశ్నించిన కుటుంబ సభ్యులపై దాడి చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.